
4లో.

## మెట్రో పెయిడ్ పార్కింగ్‌పై వెనకడుగు


# జర్నలిస్ట్ వార్త

RNI NO:Title-Code:-TELTEL02102

తెలుగు దిన పత్రిక

అనుక్షణం ప్రజల పక్షం...



WANTED రిపోర్టర్లు కావలెను

జర్నలిస్ట్ వార్త

దిన పత్రికలో పని చేయుటకు తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను

జర్నలిస్ట్ వార్త JV NEWS

ఎడిటర్: బిర్రు కరుణాకర్

Cell:9701249103



సంపుటి - 1 సంచిక - 226 ఆదివారం 25 ఆగష్టు 2024 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజీలు -5 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts


# ఇప్పటికే విచారం వ్యక్తం చేశా



మహిళల పట్ల యథాలాపంగా వ్యాఖ్యలు

ఇప్పటికే విచారం వ్యక్తం చేస్తూ ప్రకటన

2లో.

మహిళా కమిషన్ ముందు హాజరైన కెటిఆర్

రాష్ట్రంలో మహిళల సమస్యలపై కమిషన్‌కు ఫిర్యాదు

రాఖీలు కట్టి పెద్ద మనసు చాటుకున్న మహిళా కమిషన్ సభ్యులు



# అక్రమ కట్టడాల్ని కూల్చాల్సిందే

## నాగార్జున ఎన్ కన్వెన్షన్ కూల్చివేతపై హైడ్రా కమిషనర్ రంగనాథ్ వివరణ

ఎన్ కన్వెన్షన్ కూల్చివేత

కన్వెన్షన్ కట్టడం అక్రమమని తేల్చిన అధికారులు

ఎఫ్ టీఎల్, బఫర్ జోన్ నిబంధనలకు విరుద్ధం

తుమ్మిడికుంట చెరువులోని అనధికార నిర్మాణాల్లో

ఎన్ కన్వెన్షన్ ఒకటి అని వెల్లడి

తుమ్మిడికుంట ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లలోని

అక్రమ నిర్మాణాలన్నింటినీ కూల్చేసినట్లు వెల్లడి

2లో.



## నాగార్జునకు ఊరట...

### కూల్చివేతలు ఆపాలన్న కోర్టు

హైదరాబాద్‌లోని మాదాపూర్‌లోని ఎన్ కన్వెన్షన్ సెంటర్ కూల్చివేతపై సినీ నటుడు నాగార్జున తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టులో ఆయన హౌస్ మోషన్ పిటిషన్ వేశారు. హైడ్రా కూల్చివేతలపై స్టే ఇవ్వాలని నాగార్జున కోరారు. ఈ హౌస్ మోషన్ పిటిషన్‌ను విచారించిన న్యాయస్థానం ఎన్ కన్వెన్షన్ సెంటర్ కూల్చివేతలను ఆపాలని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన న్యాయమూర్తి జస్టిస్ టి. వినోద్ కుమార్ ఈ తీర్పు వెల్లడించారు.

# దేశవ్యాప్తంగా సైబర్ నేరాలతో దోపిడీ




2లో.

36మంది సైబర్ క్రిమినల్స్ పట్టివేత

ప్రత్యేక ఆపరేసన్ ద్వారా గుజరాత్‌లో అరెస్ట్

హైదరాబాద్ సీపీ కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి వెల్లడి

# నిర్మలా సీతారామన్ తో భట్టి విక్రమార్క భేటీ

హైదరాబాద్ ఆగస్టు 24,(జర్నలిస్ట్ వార్త): తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఢిల్లీ పర్యటనలో ఉన్నారు. అందులో భాగంగా ఇవాళ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ను ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కలిశారు. తెలంగాణ ఆర్థిక పరిస్థితిని వివరించి.. రాష్ట్ర అభివృద్ధికి సహకరించాల్సిందిగా కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను కోరాం అన్నారు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క. మొత్తం 8



అంశాలను ఆర్థికమంత్రి దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు.విభజన చట్టంలోని నిధుల పంపకం త్వరితగతిన చేయాలని కోరినట్లు వెల్లడించారు భట్టి. గత ప్రభుత్వం చేసిన అప్పులు రాష్ట్రానికి భారంగా మారాయని, ప్రతినెలా జీతాలకంటే ఎక్కువగా అప్పులు, వాటి వడ్డీలు చెల్లించేందుకే పోతున్నాయని తెలిపారు. చెరువులు, కొండలను కాపాడాలనేదే తమ లక్ష్యమని, హైడ్రాకు ప్రజలు సహకరించాలని భట్టి కోరారు. చట్టం ప్రకారమే నిర్ణయాలు ఉంటాయన్నారు. లెక్కలతో సహా ఎన్ని చెరువులు కబ్జాకు గురి అయ్యాయో ప్రజల ముందు పెడతామని డిప్యూటీ సీఎం భట్టి అన్నారు.



2లో.

# మూడు కీలక పథకాలకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం

విదేశీ పర్యటన ముగించుకుని భారత్ తిరిగొచ్చిన ప్రధాని మోదీ

ఢిల్లీలో మోదీ అధ్యక్షతన కేంద్ర క్యాబినెట్ సమావేశం

కీలక పథకాలపై చర్చ... ఆమోదం

# మాస్టర్ ప్లాన్ సిద్ధం చేయాలి

## - వరంగల్ పట్టణాన్ని మరో నగరంగా తీర్చిదిద్దాలి

వరంగల్ బ్యూరో, ఆగస్టు 24,(జర్నలిస్ట్ వార్త): వరంగల్ పట్టణాన్ని మరో నగరంగా తీర్చిదిద్దడానికి మాస్టర్ ప్లాన్ తక్షణమే సిద్ధం చేయాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం డా.బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలోని తన కార్యాలయ సమావేశ మందిరంలో కుడా (కాకతీయ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ) అధికారులు, పలు శాఖల అధికారులతో వరంగల్ నగర అభివృద్ధిపై సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, హైదరాబాద్ నగరం తర్వాత వరంగల్ పట్టణాన్ని అభివృద్ధి పరచడానికి, మాస్టర్ ప్లాన్ సిద్ధం చేసేందుకు పలు మార్లు సమావేశాల ద్వారా సూచనలు అందించామని తెలిపారు. గతంలో ఉన్న 2041 మాస్టర్ ప్లాన్ ను 2050 నాటి జనాభాను దృష్టిలో ఉంచుకొని పట్టణంలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రతిపాదించాలని సూచించారు. అందుకు అవసరమైన



భూముల సేకరణ చేపట్టాలని అన్నారు. ఇప్పటికే కన్సల్టెంట్లు తయారు చేసిన మాస్టర్ ప్లాన్ లను మంత్రి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పరిశీలించి, పలు సూచనలు అందించారు. ఈ సమావేశంలో మున్సిపల్ పరిపాలన ముఖ్య కార్యదర్శి దాన కిషోర్, అశ్విని కమీషనర్ కుడా వైస్ చైర్మన్, గౌతమ్ సిడీఏంఏ, హరిచందన, రోడ్లు భవనాలు శాఖ కార్యదర్శి, అజిత్ రెడ్డి, కుడా సీపీఓ, కాన్సల్టెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

# అనురాగ్ యూనివర్సిటీ పై ఫిర్యాదు...

## పల్లా రాజేశ్వర్ రెడ్డిపై కేసు




2లో.

అనురాగ్ యూనివర్సిటీపై పోలీసులకు ఫిర్యాదు చేసిన ఇరిగేషన్ శాఖ

చెరువును కబ్జా చేసి భారీ నిర్మాణం చేపట్టారని ఫిర్యాదు

## అక్రమ నిర్మాణమంటూ అనురాగ్ యూనివర్సిటీపై ఫిర్యాదు...






మేడ్చల్ ఆగస్టు 24,(జర్నలిస్ట్ వార్త): మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలోని అనురాగ్ యూనివర్సిటీపై ఇరిగేషన్ శాఖ పోలీసులకు ఫిర్యాదు చేసింది. చెరువును కబ్జా చేసి బఫర్ జోన్ పరిధిలో భారీ నిర్మాణం చేపట్టారంటూ ఫిర్యాదులో పేర్కొంది. దీంతో అనురాగ్ యూనివర్సిటీ చైర్మన్, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డిపై పోచారం ఐటీ కారిడార్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదయింది. ఘట్‌కేసర్ మండలం వెంకటాపూర్ రెవెన్యూ పరిధిలోని నాదెం చెరువు బఫర్ జోన్‌లో 1.5 ఎకరాల భూమిని ఆక్రమించి అనురాగ్ ఇన్ స్టిట్యూషన్స్ సంస్థ అక్రమ నిర్మాణాలు చేపట్టిందంటూ ఇరిగేషన్ శాఖ ఏఈ పరమేశ్... పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు.

## ఇప్పటికే విచారం వ్యక్తం చేశా

### మహిళా కమిషన్ ముందు హాజరైన కెటిఆర్



హైదరాబాద్, ఆగస్టు 24,(జర్నలిస్ట్ వార్త): తాను యథాలాపంగా చేసిన వ్యాఖ్యల పట్ల ఇప్పటికే విచారం వ్యక్తం చేశానని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ తెలిపారు. మహిళా కమిషన్ ముందు విచారణకు హాజరైన అనంతరం ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ నేతలు కమిషన్ కార్యాలయం వద్దకు వచ్చి రాజకీయం చేశారన్నారు. భారాస మహిళా నేతలపై దాడి చేశారని ఆరోపించారు. కాంగ్రెస్ అనుసరిస్తున్న వైఖరిపై అభ్యంతరం వ్యక్తం చేస్తున్నట్లు పేర్కొన్నారు. మహిళలను గౌరవించాలని విచారణకు వచ్చినట్లు తెలిపారు. రాష్ట్రంలోని సమస్యలను కమిషన్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. మహిళలపై జరుగుతున్న దాడులు, వసతి గృహాల్లో పిల్లల సమస్యలపై ప్రస్తావించినట్లు కేటీఆర్ తెలిపారు. అంతకుముందు విచారణ సందర్భంగా కేటీఆర్‌కు మహిళా కమిషన్ సభ్యులు రాఖీలు కట్టారు. మహిళలపై తాను చేసిన వ్యాఖ్యలకు వివరణ ఇచ్చేందుకు ఈరోజు మహిళ కమిషన్ ముందు కేటీఆర్ హాజరయ్యారు. వివరణ ఇచ్చేందుకని ఆయన వస్తే.. మహిళా కమిషన్ సభ్యులు పోటీలు పడి మరీ రాఖీలు కట్టడం ఒకింత ఆశ్చర్యంగా అనిపించింది. విచారణకు పిలిచి కేటీఆర్‌కు రాఖీ కట్టి సోదర అనుబంధాన్ని మహిళా కమిషన్ సభ్యులు చాటుకున్నారు. అనంతరం ఉచిత బస్సు ప్రయాణ విషయంలో మహిళలపై తాను చేసిన కామెంట్స్ యథాలాపంగా చేసినవేనని కేటీఆర్ వివరణ ఇచ్చారు. మహిళలంటే తనకు ఎంతో గౌరవం ఉందని చెప్పారు. రాష్ట్రంలో మహిళలపై ఇటీవల జరిగిన దాడులపై చర్యలు తీసుకోవాలని కేటీఆర్ కోరారు. నెల 15వ తేదీన తెలంగాణ భవన్‌లో స్టేషన్ ఘన్‌పూర్ కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న కేటీఆర్.. కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. ఈ సందర్భంలో మంత్రి సీతక్క ఆర్టీసీ ఉచిత ప్రయాణంపై కొంతమంది చేసిన వ్యాఖ్యలకు కేటీఆర్ కౌంటర్ ఇచ్చారు. బస్సుల్లో మహిళలు బ్రేక్ డాన్స్, రికార్డింగ్ డాన్సులు చేసినా తాము ఏమంటామని అంటూ వ్యంగ్యంగా కేటీఆర్ మాట్లాడారు. ఈ వ్యాఖ్యలపై పెద్ద ఎత్తున రచ్చ జరిగింది. హిళలు తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. కేటీఆర్ వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ దిష్టిబొమ్మలను దగ్ధం చేశారు. మహిళల గురించి వివాదాస్పద కామెంట్స్ చేశారని మహిళా కమిషన్ సుమోటోగా స్వీకరించి నోటీస్ ఇచ్చింది. ఈ క్రమంలోనే ఇవాళ కేటీఆర్ మహిళ కమిషన్ ఎదుట హాజరై వివరణ ఇచ్చారు. అయితే ఈ వ్యాఖ్యలపై ఇప్పటికే ఆయన క్షమాపణ చెప్పారు. యథాలాపంగా అన్నవే తప్పా మహిళలను అవమానించే ఉద్దేశం తనకు లేదని కేటీఆర్ స్పష్టం చేశారు.

## మూడు కీలక పథకాలకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం

### విదేశీ పర్యటన ముగించుకుని భారత్ తిరిగొచ్చిన ప్రధాని మోదీ
### ఢిల్లీలో మోదీ అధ్యక్షతన కేంద్ర క్యాబినెట్ సమావేశం
### కీలక పథకాలపై చర్చ... ఆమోదం



ఢిల్లీ ఆగస్టు 24,(జర్నలిస్ట్ వార్త): పోలెండ్, ఉక్రెయిన్ దేశాల్లో పర్యటన ముగించుకుని ప్రధాని నరేంద్ర మోదీ భారత్ తిరిగొచ్చారు. ఇవాళ ఢిల్లీలో మోదీ అధ్యక్షతన కేంద్ర క్యాబినెట్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మూడు కీలక నిర్ణయాలకు క్యాబినెట్ ఆమోదం లభించింది. బయో ఈ-3 (బయోటెక్నాలజీ ఫర్ ఎకానమీ, ఎన్విరాన్ మెంట్, ఎంప్లాయిమెంట్), విజ్ఞాన్ ధార పథకం... 11, 12వ తరగతి విద్యార్థులకు ఇంటర్న్ షిప్ పథకానికి కేంద్ర మంత్రి మండలి పచ్చజెండా ఊపింది. క్యాబినెట్ భేటీపై కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ స్పందించారు. బయో మాన్యుఫ్యాక్చరింగ్ రంగానికి ఊతమిచ్చేందుకు కేంద్రం నూతనంగా బయో ఈ-3 కార్యాచరణను తీసుకువస్తోందని వివరించారు. త్వరలో బయో విప్లవం రానుందని, బయో సైన్స్ రంగాల్లో భారీగా ఉపాధి అవకాశాలు ఉంటాయని తెలిపారు. ఇక... సైన్స్ అండ్ టెక్నాలజీ, రీసెర్చ్ అండ్ డెవలప్ మెంట్, ఆవిష్కరణలు, టెక్నాలజీ వృద్ధి వంటి విభాగాలను 'విజ్ఞాన్ ధార' పథకంలో సమ్మిళితం చేశారని అశ్విని వైష్ణవ్ వెల్లడించారు. తద్వారా నిధుల వినియోగం, అనుబంధ పథకాలు, కార్యక్రమాల మధ్య సమన్వయం సులభతరమవుతుందని పేర్కొన్నారు. 11, 12వ తరగతి చదివే విద్యార్థులకు కొత్తగా ఇంటర్న్ షిప్ ఉంటుందని, దీనికి కేంద్రం ఆమోదం లభించిందని తెలిపారు.

ఈ మూడు పథకాలతో పాటు ఏకీకృత పింఛను విధానానికి కూడా కేంద్ర క్యాబినెట్ సమ్మతి లభించిందని వెల్లడించారు. ఉద్యోగులకు సామాజిక భద్రతను అందించే ఈ యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్ ద్వారా 23 లక్షల మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు ప్రయోజనం కలుగుతుందని చెప్పారు.

## అక్రమ కట్టడాల్ని కూల్చాల్సిందే



హైదరాబాద్ ఆగస్టు 24,(జర్నలిస్ట్ వార్త): హైదరాబాద్‌లోని మాదాపూర్‌లో గల ఎన్ కన్వెన్షన్ కూల్చివేతపై హైడ్రా (హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ మానిటరింగ్ అండ్ ప్రొటెక్షన్) కమిషనర్ రంగనాథ్ వివరణ ఇచ్చారు. తుమ్మిడికుంట చెరువులోని అనధికార నిర్మాణాల్లో ఎన్ కన్వెన్షన్ కూడా ఒకటి అన్నారు. ఈ నిర్మాణాన్ని పూర్తిగా నేలమట్టం చేశామన్నారు. తుమ్మిడికుంట ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లలోని అక్రమ నిర్మాణాలను అన్నింటినీ కూల్చివేసినట్లు తెలిపారు. హైడ్రా, జీహెచ్ఎంసీ, టౌన్ ప్లానింగ్, రెవెన్యూ సిబ్బంది కలిసి కూల్చివేసినట్లు వెల్లడించారు. చెరువులోని ఎఫ్‌టీఎల్‌లో ఒక ఎకరా 12 గుంటల్లో... అలాగే బఫర్ జోన్‌లోని 2 ఎకరాల 18 గుంటల్లో ఎన్ కన్వెన్షన్‌ను నిర్మించినట్లు తెలిపారు. ఈ నిర్మాణానికి జీహెచ్ఎంసీ నుంచి ఎలాంటి నిర్మాణ అనుమతులు లేవన్నారు. గతంలో అనుమతుల కోసం ప్రయత్నించినప్పటికీ... అనుమతులు రాలేదన్నారు. హైదరాబాద్ పరిధిలో అక్రమ నిర్మాణాలను కాంగ్రెస్ ప్రభుత్వం తొలగిస్తోంది. ఇందుకోసం ప్రత్యేకంగా హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ మానిటరింగ్ అండ్ ప్రొటెక్షన్ (హైడ్రా) ను ఏర్పాటు చేసింది. తాజాగా శనివారం హైడ్రా అధికారులు నాగార్జునకు చెందిన ఎన్ కన్వెన్షన్ ను కూల్చివేశారు. చెరువును ఆక్రమించి కట్టారని, ఆమేరకు కట్టడాలను నేలమట్టం చేసింది.

మాదాపూర్ లో మొత్తం పది ఎకరాల విస్తీర్ణంలో హీరో నాగార్జున, నల్ల ప్రీతమ్ రెడ్డి సంయుక్తంగా ఎన్ కన్వెన్షన్ ను నిర్మించారు. దీనిపై పలు ఆరోపణలు వెల్లువెత్తాయి. చెరువు స్థలాన్ని కబ్జా చేసి కట్టారని చాలా మంది విమర్శించారు. ఈ పదెకరాలలో 1.12 ఎకరాలు ఫుల్ ట్యాంక్ లెవల్ (ఎఫ్ టీఎల్) పరిధిలో, మరో 2 ఎకరాలు బఫర్ జోన్ లో ఉన్నాయని అధికారులు కూడా గుర్తించారు. దీంతో హైడ్రా అధికారులు తాజాగా ఈ కట్టడాన్ని కూల్చివేశారు.

### ఏంటీ ఫుల్ ట్యాంక్ లెవల్..?

వర్షాకాలంలో చెరువులు, కుంటలు నిండుగా ఉంటాయి. నీటితో నిండిన ఈ ప్రాంతం మొత్తాన్ని ఫుల్ ట్యాంక్ లెవల్ (ఎఫ్ టీఎల్) అంటారు. అన్ని కాలాల్లోనూ నీరు ఈ ఫుల్ ట్యాంక్ లెవల్ ఉండదు. వేసవిలో నీరు తగ్గి ఖాళీ జాగా బయటపడుతుంది. అయినా అదంతా చెరువుకు చెందిన ప్రాంతమే. ఫుల్ ట్యాంక్ లెవల్ ఉన్నపుడు నీరు ఎక్కడి వరకైతే ఉంటుందో అక్కడి వరకు ఎలాంటి నిర్మాణం చేపట్టకూడదు.


ఎఫ్ టీఎల్ ప్రాంతంలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదనేది రూల్. దీనిని అతిక్రమించి కట్టిన నిర్మాణాల విషయంలో ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. ఈ ఎఫ్ టీఎల్ పరిధిలో పట్టా కలిగిన సాగు భూమి ఉంటే.. నీళ్లు లేని సమయంలో సదరు పట్టాదారు తన భూమిలో పంటలు పండించుకోవచ్చు. నీళ్లతో నిండినపుడు మాత్రం ఎలాంటి హక్కు ఉండదు. ఏ పని చేయడానికి వీలు లేదు.

### బఫర్ జోన్ అంటే..?

ప్రతి నీటి వనరును, విస్తీర్ణం ఆధారంగా బఫర్‌జోన్ నిర్ధారిస్తారు. 25 హెక్టార్లు, అంతకుమించి విస్తీర్ణంలో ఉన్న చెరువు, జలాశయాలు బఫర్‌జోన్ నిర్ధారణకు 30 మీటర్లను ప్రామాణికంగా తీసుకుంటారు. జంట జలాశయాల పరిధి చుట్టూ ఎఫ్‌టీఎల్‌ను ఆనుకొని 30 మీటర్లు (వంద ఫీట్లు) బఫర్‌జోన్‌గా ఉంది. ఇక్కడ సాగు సంబంధిత కార్యకలాపాలు మాత్రమే చేపట్టాలి. ఎట్టి పరిస్థితుల్లో నిర్మాణాలు చేపట్టవద్దనే స్పష్టమైన నిబంధన ఉంది.

## పూర్తిస్థాయిలో 2లక్షలు మాఫీ చేయాలి

### ఆర్మూర్‌లో రైతుల మహాధర్నా



నిజామాబాద్, ఆగస్టు 24,(జర్నలిస్ట్ వార్త): ఎలాంటి షరతులు లేకుండా రూ.2 లక్షల రుణాలు మాఫీచేయాలని డిమాండ్ చేస్తూ ఇందూరు రైతాంగం పోరుబాట పట్టింది. ఇచ్చిన మాట ప్రకారం ఆంక్షలు లేకుండా రుణాలు మాఫీ చేయాలంటూ నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లో మహాధర్నా నిర్వహిస్తున్నారు. రైతు ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధర్నాకు ఆర్మూర్, బాల్కొండ, నిజామాబాద్ రూరల్ నియోజకవర్గాల నుంచి రైతులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. మామిడిపల్లి రోడ్డుపై బైఠాయించారు. ఎలాంటి షరతులు లేకుండా ఏకకాలంలో రూ.2 లక్షలు రుణమాఫీ మాఫీచేయాలని డిమాండ్ చేస్తున్నారు. తక్షణమే ఎకరానికి రూ.7500 చొప్పున రైతు భరోసా నిధులు విడుదల చేయాలన్నారు. రైతు జేఏసీ నిర్వహిస్తున్న ధర్నాకు బీఆర్ఎస్, బీజేపీ, వామపక్షాలు సంపూర్ణ మద్దతు తెలిపాయి. కాగా, మహాధర్నా నేపథ్యంలో ఆర్మూర్ పట్టణంలో పోలీసులు పెద్ద సంఖ్యలో మోహరించారు. బీఆర్ఎస్‌తోపాటు విపక్షాలకు నాయకులను ముందస్తు అరెస్టులు చేశారు. రైతులు మామిడిపల్లికి రాకుండా ఎక్కడికక్కడ అడ్డుకుంటున్నారు. రైతులు రోడ్లపైకి వస్తే చర్యలు తప్పవని హెచ్చరికలు జారీ చేశారు. ఈ నెల 25 వరకు ఆర్మూర్, బాల్కొండ సెగ్మెంట్లలో ఆంక్షలు విధించారు.

ఆర్మూర్ ధర్నాకు భారీగా రైతులు సతరలివచ్చారు. బిఆర్ఎస్ నేతలు జీవన్ రెడ్డి, బాజిరెడ్డి గోవర్ధన్, వేముల ప్రశాంత్ రెడ్డి తదితరులు హాజరయ్యారు. ప్రజలకు ఆశలు చూపి గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్టీ మోసం చేస్తున్నదని, రైతుబంధు డబ్బులనే రుణమాఫీకి వాడారని, అయినా సంపూర్ణంగా మాఫీ చేయలేదని ఎమ్మెల్యే వేముల ప్రశాంతరెడ్డి అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల ముందు రైతులంతా బ్యాంకులకు వెళ్లి రుణాలు తీసుకోవాలని, అందరికీ మాఫీ చేస్తామని చెప్పి.. ఇప్పుడేమో నిబంధనల పేరుతో రైతులను ఇబ్బంది పెడుతున్నారని అన్నారు.రైతుధర్నాలో పాల్గొని ఆయన మాట్లాడారు. అమలుకు నోచుకోని హామీలను ఇచ్చి ప్రజలను మోసం చేసిన రేవంత్ సర్కారుకు ప్రజలే బుద్ధి చెబుతారని అన్నారు. రైతు రుణమాఫీకి ఏడున్నర వేలు కోట్లు మాత్రమే విడుదలయ్యాయని, అవి కూడా రైతుబంధు డబ్బులేనని తెలిపారు. రుణమాఫీ విషయంలో సీఎం సంపూర్ణంగా చేశామని చెబితే, ఒక మంత్రి ఏడున్నర వేల కోట్లు అయ్యాయని చెప్పడాన్ని ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు.

## దేశవ్యాప్తంగా సైబర్ నేరాలతో దోపిడీ

హైదరాబాద్, ఆగస్టు 24,(జర్నలిస్ట్ వార్త): దేశవ్యాప్తంగా సైబర్ నేరాలకు పాల్పడుతూ ప్రజల నుంచి కోట్లు కొల్లగొట్టిన 36మంది సైబర్ క్రిమినల్స్‌ని అరెస్టు చేసినట్లు హైదరాబాద్ సీపీ కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఏడు బృందాలుగా విడిపోయిన సైబర్ క్రైమ్ పోలీసులు.. నిందితులను ప్రత్యేక ఆపరేషన్ ద్వారా గుజరాత్‌లో అరెస్టు చేసినట్లు ఆయన వెల్లడించారు. వీరంతా అక్కడ్నుంచే అమాయకులను అధిక లాభాల పేరిట మోసం చేస్తున్నట్లు సీపీ పేర్కొన్నారు. దీంతో వల పన్ని నిందితులను అరెస్టు చేసినట్లు శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. దేశవ్యాప్తంగా ఈ 36మంది నిందితులపై సుమారు వెయ్యి కేసులు ఉన్నాయి. తెలంగాణ వ్యాప్తంగా వీరిపై సుమారు 150కేసులు ఉన్నాయి. వీటిలో హైదరాబాద్ పరిధిలో 20కేసులు నమోదు అయ్యాయి. ఈ 20 కేసుల్లోనే వీరు సుమారు రూ.12కోట్లకు పైగా ఫ్రాడ్ చేశారు. వీరు దోచుకున్న నగదులో ఇప్పటికే రూ. 4.4 కోట్లు ఫ్రీజ్ చేశాం. ఫ్రీజ్ చేసిన డబ్బులో రూ.1.5కోట్లు బాధితులకు తిరిగి ఇచ్చాం. వీరిని అరెస్టు చేసిన సమయంలో నిందితుల నుంచి రూ.38లక్షలు, బంగారం, ల్యాప్‌ట్యాప్స్, బ్యాంక్ చెక్ బుక్స్, పాస్ బుక్స్ సీజ్ చేశాం. సెల్ కంపెనీలకు చెందిన నకిలీ స్టాంపులనూ సీజ్ చేశాం. హైదరాబాద్ నగరంలో ట్రేడింగ్ పేరిట మోసాలు చేసిన ముగ్గురిని అరెస్టు చేశాం. కనాని, నికుంజ్ సహా కిషోర్ భాయ్ అనే చా÷-టర్గ÷డ్ అకౌంటెంట్‌ని అదుపులోకి తీసుకున్నాం. ముందుగా నిందితులు మోతీలాల్ ఓస్వాల్ సెక్యూరిటీ పేరుతో టెలిగ్రాంలో లింక్ సెండ్ చేస్తారు. అందులో ఇన్వెస్ట్మెంట్, ట్రేడింగ్ చేస్తే లాభాలు వస్తాయని నమ్మించి మోసం చేస్తు?న్నారు. రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగిని ట్రేడింగ్ పేరుతో నమ్మించి రూ.61లక్షలు కాజేశారు. బాధితుడు డబ్బులు పంపిన అకౌంట్ ఆధారంగా దర్యాప్తు చేశాం. ఈ ముగ్గురిపై 142ఫిర్యాదులు ఔఅఖీఖలో నమోదు అయినట్లు గుర్తించాం. వీరిని అరెస్టు చేసి మొబైల్, బ్యాంక్ డెబిట్ కార్డ్స్, పాస్ బుక్ స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. మరో కేసులో నిందితులు ఫెడ్ ఎక్స్ పేరిట మోసాలకు పాల్పడ్డారు. ఈ మోసంలో బాధితులను రకరకాలుగా బెదిరించి డబ్బులు వసూలు చేశారు. నగరానికి చెందిన వృద్ధురాలైన డాక్టర్‌ని నిందితులు మోసం చేశారు. మనీ ల్యాండరింగ్ కేసు నమోదు చేశామంటూ ఆమెకు ఫోన్ చేసి బెదిరించారు. విచారణకు రావాలని ఫేక్ ఎఫ్ఐఆర్, నకిలీ ఆర్బీఐ లెటర్, సీబీఐ లెటర్లు పంపించారు. అరెస్టు కాకుండా ఉండాలంటే అడిగినంత డబ్బు పంపాలంటూ భయపెట్టారు. దీంతో ఆమె రూ.1.6కోట్లు నిందితుల ఖాతాకు పంపారు. మోసపోయానని తెలుసుకుని ఫిర్యాదు చేశారు. జులైలో నమోదైన ఈ కేసులో ఇద్దరిని అరెస్టు చేశాం. సాగర్ ప్రజాపతి, నాథో భాయ్ అరెస్టు కాగా.. మరో నిందితుడు పరారీలో ఉన్నాడు. వీరి నుంచి రూ.10లక్షలు, పాస్ బుక్‌లు, నకిలీ షెల్ కంపెనీల స్టాంపులు స్వాధీనం చేసుకున్నామన్నారు. మరో కేసులో ఇన్వెస్ట్మెంట్ పేరుతో కేటుగాళ్లు మోసానికి తెరతీశారు. తాము చెప్పినట్టు పెట్టుబడి పెడితే లాభాలు వస్తాయని నమ్మించి కోట్లు కాజేశారు. ముందుగా ఆరు, ఏడు సార్లు కొంత లాభాలు ఇచ్చి ఆపై పెద్ద మొత్తంలో డబ్బులు పెట్టగానే బాధితుడిని మోసం చేశారు. ఈ కేసులో రామ్ కోటికి చెందిన వ్యాపారి నుంచి ఏకంగా రూ.2కోట్లు కొట్టేశారు. ఈ కేసులో గుజరాత్‌కు చెందిన ముగ్గురిని అరెస్ట్ చేశాం' అని తెలిపారు.

## నక్సలిజంపై పోరాటం చివరి దశకు చేరుకుంది: అమిత్ షా

### ఛత్తీస్ గఢ్ లో అంతర్రాష్ట్ర సమన్వయ భేటీ
### హాజరైన ఛత్తీస్ గఢ్ సీఎం, పొరుగు రాష్ట్రాల సీఎస్ లు, డీజీపీలు
### 2026 నాటికి నక్సలిజం నుంచి దేశానికి విముక్తి కలుగుతుందన్న అమిత్ షా

ఆగస్టు 24,(జర్నలిస్ట్ వార్త): ఛత్తీస్ గఢ్ లో కేంద్ర హోంమంత్రి అమిత్ షా అధ్యక్షతన అంతర్రాష్ట్ర సమన్వయ భేటీ జరిగింది.




ఈ కీలక సమావేశంలో ఛత్తీస్ గఢ్ ముఖ్యమంత్రి, పొరుగు రాష్ట్రాల సీఎస్ లు, డీజీపీలు పాల్గొన్నారు. ఈ భేటీలో అమిత్ షా మాట్లాడుతూ, నక్సల్ ప్రభావిత రాష్ట్రాల్లో మౌలిక సౌకర్యాల కల్పన, ఎదురవుతున్న సవాళ్లపై చర్చించామని వెల్లడించారు. దేశంలో నక్సలిజంపై పోరాటం చివరి దశకు చేరుకుందని తెలిపారు. 2026 నాటికి దేశానికి నక్సలిజం నుంచి విముక్తి కల్పిస్తామని పేర్కొన్నారు. నక్సలిజాన్ని ఎదుర్కొనేందుకు సరైన వ్యూహంతో ముందుకెళుతున్నామని చెప్పారు.

నక్సలిజం వల్ల గత 10 సంవత్సరాలలో 6,617 మంది భద్రతా సిబ్బంది, పౌరులు ప్రాణాలు కోల్పోయారని అమిత్ షా వివరించారు. ఇటీవల కాలంలో భద్రతా సిబ్బంది, పౌరుల మరణాలు 70 శాతం వరకు తగ్గాయని అన్నారు.

# ఓటర్ చైతన్య కార్యక్రమాల నివేదికను ఆవిష్కరించిన కలెక్టర్ డాక్టర్ సత్య శారదా దేవి

వరంగల్ బ్యూరో, ఆగస్టు 24,(జర్నలిస్ట్ వార్త): గత ఎన్నికల్లో ఓటింగ్ శాతాన్ని పెంచే లక్ష్యంగా స్వీప్ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా చేపట్టిన ఓటరు చైతన్య కార్యక్రమాల విజయవంతంలో వివిధ స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యం ఎంతైనా ఉందని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా దేవి అన్నారు. శనివారం గత ఎన్నికలలో ఓటింగ్ శాతం తక్కువగా నమోదైన జిల్లాలలో ఓటింగ్ శాతాన్ని పెంచే లక్ష్యంగా మహాత్మా గాంధీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఓటర్ చైతన్య కార్యక్రమాల నివేదికను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టే ఏ కార్యక్రమాలైనా, పౌర సమాజ చైతన్యంతో, స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యంతోనే విజయవంతం అవుతాయన్నారు. ఈ సందర్భంగా మహాత్మా గాంధీ చారిటబుల్ ట్రస్ట్ వరంగల్, హనుమకొండ జిల్లాల కన్వీనర్, రాష్ట్రపతి అవార్డు గ్రహీత పరికిపండ్ల వేణు మాట్లాడుతు గాంధీ - గుడి ఆధ్వర్యంలో ఓటింగ్ శాతాన్ని పెంచడానికి ఓటర్ అవగాహన చైతన్య రథంను ఏర్పాటు చేసుకొని హనుమకొండ, వరంగల్, కాజీపేట త్రినగరిలోని




వివిధ కాలనీలలో తిరుగుతూ, ఓటు హక్కు వినియోగంపై ప్రజలను చైతన్య పరుస్తూ, కరపత్రాలు పంపిణీ చేస్తూ, ప్లేకార్డులతో ర్యాలీలు నిర్వహించి, అనేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, ఓటింగ్ శాతం పెంపుదలకు ప్రభుత్వం చేస్తున్న కృషిలో భాగస్వాములం అయ్యామన్నారు. ఈ కార్యక్రమంలో ఆదనవు కలెక్టర్ సంధ్యారాణి, డిఆర్డీఓ కౌసల్య దేవి, ఎల్ డి ఎం రాజు, ప్రముఖ సామాజికవేత్త, అభ్యుదయ సేవా సమితి అధ్యక్షులు మండల పరుశరాములు తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్యేక ప్రజావాణి అర్జీల పరిష్కారంలో జాప్యం తగదు

## - వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా దేవి



వరంగల్ బ్యూరో, ఆగస్టు 24,(జర్నలిస్ట్ వార్త): ప్రత్యేక ప్రజావాణిలో స్వీకరించిన అర్జీల పరిష్కారంలో జాప్యం వహించకుండా త్వరితంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా దేవి అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో దివ్యాంగులు, వయోవృద్ధులకు నిర్వహించిన ప్రత్యేక ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ డాక్టర్ సత్య శారదా దేవి, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డిఆర్డిఓ కౌసల్య దేవి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారి హైమావతి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి వెంకటరమణ ఫిర్యాదులను స్వీకరించారు. గ్రీవెన్స్ లో దివ్యాంగులు, వృద్దులు జిల్లా నలుమూలల నుంచి వివిధ రకాల సమస్యల పై దరఖాస్తులు సమర్పించారు. మొత్తం దరఖాస్తులు (17)వచ్చాయి. అందులో డిఆర్డిఓ - 08, సివిల్ సప్లై - 04, ఆర్డీవో వరంగల్ - 01, ఎంప్లాయిమెంట్ శాఖ -03
జిల్లా విద్యాశాఖ - 01 ఉన్నాయి. దరఖాస్తులను సంబంధిత శాఖలకు ఎండార్స్ చేస్తూ, పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఆర్వోఆర్ ముసాయిదా చట్టాన్ని తెచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోంది

## - పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాష్ రెడ్డి

వరంగల్ బ్యూరో, ఆగస్టు 24,(జర్నలిస్ట్ వార్త): ప్రజలు, రైతులకు ప్రయోజనకారిగా ఉండే విధంగా ఆర్ ఓ ఆర్ ముసాయిదా చట్టాన్ని తెచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నదని పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాష్ రెడ్డి అన్నారు. ఎన్నో రాష్ట్రాల భూ చట్టాలను సమగ్రంగా అధ్యయనం చేసి తీసుకొస్తున్న కొత్త ఆర్వోఆర్ చట్టం భవిష్యత్తు తరాలకు ఉపయోగపడనుందని ఆయన అన్నారు. భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రవేశపెడుతున్న నూతన తెలంగాణ హక్కుల రికార్డు (ఆర్వోఆర్) ముసాయిదా బిల్లు పై రైతులు, మేధావులు, ప్రజలు అందించిన సలహాలు, సూచనలను ప్రభుత్వానికి నివేదిస్తామని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా దేవి అన్నారు. శనివారం కలెక్టర్ డాక్టర్ సత్య శారదా అధ్యక్షతన జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాష్ రెడ్డి, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, రిటైర్డ్ రెవెన్యూ ఉద్యోగులు, విద్యావేత్తలు, న్యాయవాదులు నిపుణులతో నూతన ఆర్వోఆర్ చట్టం ముసాయిదా బిల్లుపై చర్చ కార్యక్రమం నిర్వహించారు. నూతన ఆర్వోఆర్ చట్టం 2024 ముసాయిదా బిల్లులో పేర్కొన్న అంశాలు, ఈ బిల్లు తీసుకురావడంలో గల ఉద్దేశం అదనపు కలెక్టర్ సంధ్యారాణి వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారం కోసం నూతన ఆర్వోఆర్ చట్టం రూపొందించాలని ప్రభుత్వం సంకల్పించిందన్నారు. దేశ వ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో అమలవుతున్న ఉత్తమమైన భూ రికార్డుల నిర్వహణ పరిశీలించిన నిపుణుల బృందం నూతన ఆర్వోఆర్ 2024 ముసాయిదా బిల్లును రూపొందించిందని కలెక్టర్ తెలిపారు. నూతన చట్టం రూపకల్పనలో విస్తృతంగా ప్రజలను భాగస్వామ్యం చేయాలనే ప్రభుత్వ ఆదేశాల మేరకు నేడు చర్చ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని



చెప్పారు. భూ రికార్డుల నిర్వహణ మెరుగ్గా ఉండే విధంగా ముసాయిదా బిల్లుపై రైతు సంఘాలు, మేధావులు, విద్యావేత్తలు, ప్రజాప్రతినిధులు, రెవెన్యూ అధికారులు తమ సూచనలను అందజేయాలని కలెక్టర్ కోరారు. నూతన ఆర్వోఆర్ చట్టం ముసాయిదా బిల్లుపై సలహాలు, సూచనలు ఏమైనా ఉంటే రాతపూర్వకంగా 2 లేదా 3 రోజులలో కలెక్టరేట్ కార్యాలయానికి అందిస్తే, వాటిని ఒక నివేదిక రూపంలో సిద్ధం చేసి, తుది చట్ట రూపకల్పన కోసం ప్రభుత్వానికి అందజేస్తామని కలెక్టర్ అన్నారు. ఈ చర్చ కార్యక్రమంలో పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ ఆదనవు జాయింట్ కలెక్టర్ విఠల్, విశ్రాంత రెవిన్యూ అధికారి సురేష్ కోఠార్, సీనియర్ సైంటిస్ట్ మల్లేశం, ప్రభుత్వ ప్లీడర్ నర్సింహా రావు, టిజిటీఏ అధ్యక్షులు మహ్మద్ ఇక్బాల్, ట్రెసా అధ్యక్షులు రియజోద్దీన్, న్యాయవాదులు తమ తమ సూచనలు, సలహాలు తెలిపారు. గ్రామంలోని ఆబాది భూ రికార్డులు అప్డేట్ చేయాలని, పోజిషన్ కాలం ఉండాలని, అప్పిలేట్ అథారిటీ ఆర్డిఓ స్థాయిలో ఉండాలని, భూదార్ నంబర్ తొలగించాలని, ఆపిల్ కాల పరిమితిని 30 నుండి 90 రోజులకు పెంచాలని అన్నారు. 1971 సంవత్సరంలో ఆర్వోఆర్ చట్టం తెస్తే 1989 లో రూల్స్ అందించారని, 2020 ఆర్వోఆర్ చట్టానికి ఇప్పటివరకు రూల్స్ తయారు చేయలేదన్నారు. నూతన ఆర్వోఆర్ చట్టం 2024 అమలు చేసిన నెలరోజులలోపల రూల్స్ రూపొందించాలని తెలిపారు. నూతన ఆర్వోఆర్ చట్టం అమలు కోసం ప్రతి గ్రామంలో రెవెన్యూ ఉద్యోగి ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని, భూ సమస్యల అప్పిలేట్ అథారిటీ జిల్లా స్థాయిలోనే ఉండే విధంగా చూడాలని తెలిపారు. ఈ చర్చ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ఆదనవు జాయింట్ కలెక్టర్ విఠల్, విశ్రాంత రెవిన్యూ అధికారి సురేష్ కోఠార్, సీనియర్ సైంటిస్ట్ మల్లేశం, ప్రభుత్వ ప్లీడర్ నర్సింహా రావు, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ జీవన్ గౌడ్, సెక్రెటరీ ముదస్సిర్ అహ్మద్, విద్యాసాగర్, తహసిల్దార్ లు, నిపుణులు, న్యాయవాదులు, రైతులు, రిటైర్డ్ రెవెన్యూ ఉద్యోగులు సంబంధిత అధికారులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కృష్ణాష్టమి వేడుకలు

**చెన్నారావుపేట, ఆగస్టు 24,(జర్నలిస్ట్ వార్త):** చెన్నారావుపేట మండలం ఉప్పరపల్లి గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ముందస్తుగా కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం తేజావత్ జయ మాట్లాడుతూ విద్యార్థులలో భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను పెంపొందించే ఉద్దేశంతో పండుగలను, ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులలో జాతీయ భావం పెంపొందించడానికి అన్ని మతాల పండుగలను పురస్కరించుకోవడం జరుగుతుందన్నారు.



స్నేహభావం పెంపొందించడానికి మన పూర్వ చరిత్రను పెంపొందించేలా కృషి చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు కృష్ణుడి వేషధారణతో అలరించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉట్టి కొట్టి కృష్ణాష్టమి వేడుకలను ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. ఈ వేడుకల్లో ఉపాధ్యాయులు సునీత, శశిధర్, సంతోష్ కుమార్, బాలాజీ రావు, ఉదయ్ కుమార్, మొగిలి, సుందర్, సిహెచ్ మాధవి, వ్యాయామ ఉపాధ్యాయురాలు స్వప్న, రమాదేవి , వర్దెల్లి సతీష్ కుమార్, క్రాఫ్ట్ టీచర్ చింతకింది ఇందిర, జూనియర్ అసిస్టెంట్ జాహెద్ పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేయడం జరిగిందన్నారు.

# బాధిత కుటుంబాలకు కాంగ్రెస్ నాయకుల పరామర్శ



రాయపర్తి, ఆగస్టు 24,(జర్నలిస్ట్ వార్త): రాయపర్తి మండలం కొత్తూరు గ్రామానికి చెందిన దండ శ్రీరామమ్మ శనివారం అనారోగ్యంతో మృతి చెందారు. అదే గ్రామానికి చెందిన తాటికాయల నర్సమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. మృతి చెందిన ఇరువురు కాంగ్రెస్ సీనియర్ నాయకుల కుటుంబ సభ్యులు కావడంతో శనివారం కాంగ్రెస్ నాయకులు బాధిత బాధిత కుటుంబాలని సందర్శించి, పరామర్శించారు. ఈ పరామర్శలో పాల్గొన్న బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు జాటోత్ హమ్యా నాయక్, మండల అధ్యక్షులు ఈదుల కంటి రవీందర్ రెడ్డి బాధిత కుటుంబాల వారికి ఆర్థిక సహాయం అందజేశారు. వారి వెంట గ్రామ పార్టీ అధ్యక్షులు కందికట్ల యాకయ్య, గ్రామ నాయకులు అప్పడి నరసింహారావు, చెరుకూరి నాగేశ్వర్ రావు, గద్దె మాధవరావు, మందాటి సుదర్శన్ రెడ్డి, కందికట్ల రాజయ్య, చిర్ర నాగరాజు, నాలం రవి, కందికట్ల కొమురయ్య, చిర్ర బాబు, అంబటి కుమార్, కందికట్ల కుమారస్వామి, తానికొండ రంగారావు తదితరులు పాల్గొన్నారు.

# అక్రమంగా మొరం తరలిస్తున్న లారీల పట్టివేత

## - కేసు నమోదు చేసిన ఎస్సై పి. శ్రీనివాస్



ఐనవోలు, ఆగస్టు 24,(జర్నలిస్ట్ వార్త): ఐనవోలు మండలం కొండపర్తి గ్రామ శివారులో అక్రమంగా తరలిస్తున్న మొరం టిప్పర్ లారీలను శనివారం ఎస్సై పి. శ్రీనివాస్ పట్టుకున్నారు. ఈ సందర్భంగా వారు తెలిపిన వివరాల ప్రకారం కొండపర్తి గ్రామంలోని పెద్దమ్మ గుడి సమీపంలో ఎలాంటి అనుమతులు లేకుండా ప్రభుత్వ భూమి నుండి అక్రమంగా మొరం తవ్వి రవాణా చేస్తున్నారన్న సమాచారం మేరకు సంఘటనా స్థలానికి చేరుకోవడం జరిగిందన్నారు. అనంతరం అక్రమంగా రవాణా చేస్తున్న 3 టిప్పర్ లారీలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వాహనాలతో పాటు నిర్వాహకులపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

# రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ఎంపికైన సోషల్ వెల్ఫేర్ విద్యార్థి విష్ణు ప్రియ



పర్వతగిరి, ఆగస్టు 24,(జర్నలిస్ట్ వార్త): వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం సోషల్ వెల్ఫేర్ పాఠశాలకు చెందిన విద్యార్థి విష్ణు ప్రియ రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల నిర్వాహకులు ఓ ప్రకటన ద్వారా పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఉమ్మడి వరంగల్ జిల్లా డిసిఓ, పర్వతగిరి సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాల, కళాశాల ప్రిన్సిపల్ అపర్ణ ఎంపికైన విద్యార్థి అపర్ణని అభినందించారు.

# అందుబాటులో మందు పథకం..!

## రాయపర్తి మండల పరిధిలో విచ్చలవిడిగా విక్రయాలు



- నిత్యవసర వస్తువులా కిరాణం షాపుల్లో మద్యం అమ్ముతున్నారు
- ఎనీ టైం అమ్మకాలపై 40 నుంచి 50 రూపాయలు ఎక్కువ వసూల్ చేస్తున్నారు
- ఓ రకంగా చెప్పాలంటే నేరాలకు మద్యం 50 శాతం కారణం
- ఎక్సైజ్ అధికారులు చర్యలు తీసుకునే పరిస్థితి లేదు



**రాయపర్తి, ఆగస్టు 24,(జర్నలిస్ట్ వార్త):** వరంగల్ జిల్లా రాయపర్తి మండలంలో మద్యం విక్రయాలు విచ్చలవిడిగా జరుగుతున్నాయి. మండల పరిధిలోని గ్రామంలో చూసినా అనేకంగా బెల్టు షాపులు దర్శనమిస్తున్నాయి. అడ్డుకునేవారు లేకపోవడంతో మద్యం అమ్మకాలు గతంలో కంటే మరింత జోరుగా సాగుతున్నాయి. ప్రభుత్వం అధికారికంగా రూపొందించిన వైన్స్ షాపులు ఉండగా బెల్ట్ షాపులు అనేకంగా ఏర్పడుతున్నాయి. వైన్స్ షాప్ యాజమాను గ్రామీణ ప్రాంతాలను ఎంపిక చేసుకుని ఆటోల ద్వారా మద్యం సరఫరా చేస్తున్నారు. వైన్స్ షాపుల వద్ద సమయపాలన పాటిస్తూ విక్రయాలు చేయడంతో మద్యం ప్రియులు వైన్స్ షాపుల వద్దకు వెళ్లి మద్యం సేవించడం కష్టంగా మారుతుంది. ఇదే అదనగా తీసుకున్న కొంతమంది లిక్కర్ విక్రయదారులు అందుబాటులోకి మందు పథకాన్ని తీసుకువచ్చారు. సమయం సందర్భం లేకుండా ఒక్క బాటిల్ పై 40 నుంచి 50 రూపాయలు అధిక ధరలను వసూల్ చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. అమ్ముతున్న వారు అందలమెక్కుతున్నారు. సమయం సందర్భం లేకుండా మద్యం సేవించే వారి కుటుంబాలు ఆర్థికంగా దిగువ స్థాయికి చేరుతున్నాయి. 24 గంటలో ఎప్పుడు పడితే అప్పుడు మద్యం సేవించడంతో మద్యం ప్రియుల ఆరోగ్య పరిస్థితులు మరింత దారుణంగా తయారవుతున్నాయి. దీంతో అనేక కుటుంబాలు ఆర్థిక నష్టాలను భరిస్తూ జీవనం కొనసాగిస్తున్నాయి. వైన్స్ షాపుల వద్ద విక్రయాలు చాలవంటూ కిరాణ దుకాణాలలో లభ్యం కావడం విశేషం. గతంలో కిరాణం షాపు వద్దకి నిత్యవసర సరుకులను కొనుగోలు చేయడానికి మాత్రమే ప్రజలు వెళ్లేవారు. ప్రస్తుతం కిరాణం షాపుల వద్ద నిత్యవసర సరుకుల వలె మద్యం విక్రయించడంతో మరింత ఎక్కువమంది కస్టమర్లు కిరాణం షాపుల వద్ద బారులు తీరుతున్నారు. ఫలానా కిరాణం షాపులో నిత్యవసర సరుకులు అందుబాటులో ఉన్నాయని చెప్పుకునే విధంగా ఫలానా కిరాణం షాపులో ఫలానా బ్రాండ్ లిక్కర్ లభ్యమవుతుందని చెప్పుకునే పరిస్థితి మండల పరిధిలో చోటు చేసుకుంది. ఓ రకంగా చెప్పాలంటే మండల పరిధిలో జరుగుతున్న నేరాలకు మద్యం అందుబాటులో లభించడం 50 శాతం కారణంగా తయారైంది. సమయం సందర్భం లేకుండా మద్యం విక్రయాలు చేస్తుంటే మద్యం సేవించిన కొందరు నేరగాళ్లు వివిధ నేరాలకు పాల్పడుతున్నారనే వాదన వినిపిస్తోంది. అందుకు నిదర్శనంగా మండల పరిధిలో ఇటీవల జరిగిన నేరాలు నిదర్శనమౌతున్నాయి. ఇట్టి విషయమై సంబంధిత ఎక్సైజ్ అధికారులకు సమాచారం ఇచ్చినా వారు పట్టించుకునే పరిస్థితిలో లేకపోయారు. ప్రజా సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టాలంటే అధిక ఆదాయం ఎక్సైజ్ ద్వారా చెల్లిస్తున్నట్లు సమాచారం ప్రచారంలో ఉంది. నేరుగా ఎక్సైజ్ అధికారులతో మద్యం విక్రయాల కారణంగా గ్రామీణ ప్రాంతాల్లో జరుగుతున్న విధ్వంశాలపై సమాచారం ఇవ్వగా ఏం చేయలేని పరిస్థితిలో ఉన్నామని బదిలిస్తున్నారు. ప్రభుత్వం బెల్టు షాపులపై చర్యలు తీసుకోవాలని ఆదేశిస్తే తప్ప, తమకు తాముగా చర్యలు తీసుకునే పరిస్థితి లేకపోయిందంటున్నారు. కంట్రోల్ చేయాల్సిన సంబంధిత శాఖ అధికారులే చేతులెత్తేస్తుంటే పట్టించుకునే నాధుడే లేకపోయాడని మండల పరిధిలో చర్చ సాగుతోంది.

### మద్యం విక్రయాలపై ఆరోపణలు

మండల పరిధిలో సమయం సందర్భం లేకుండా బెల్ట్ షాపులను ఆశ్రయించి అనేకులు మద్యం సేవిస్తున్నారు. సేవించిన మద్యం మత్తులో కొంతమంది యువకులు వివిధ నేరాలకు పాల్పడుతున్నారు. అయినప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదంటే రానున్న రోజుల్లో రేషన్ షాపుల వద్ద నిత్యవసర వస్తువుల వలె నిక్కర్ పంపిణీ చేసే ప్రమాదం కనిపిస్తోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. గతంలో రేషన్ షాప్ లో వద్ద బియ్యం పొందాలంటే ప్రభుత్వం పంపిణీ చేసిన చక్కెర, గోధుమలు, శనగలు, సర్ఫ్ ప్యాకెట్లు, ఉప్పు కొనుగోలు చేస్తేనే బియ్యం ఇస్తామని రూల్స్ పెట్టేవారు. అదేవిధంగా మరి కొద్ది రోజుల్లో రేషన్ షాపుల నుంచి లిక్కర్ కొనుగోలు చేయాలని రూల్స్ పెట్టే ప్రమాదం ఉందని మండల ప్రజలు బహిరంగంగా చర్చించుకుంటున్నారు.

## మెడల్స్ సాధించిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు

### - విజేతలను అభినందించిన ఉపాధ్యాయులు







వర్ధన్నపేట, ఆగస్టు 24,(జర్నలిస్ట్ వార్త): వర్ధన్నపేట మండలం ఇల్లంద గ్రామ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు యోగ పోటీలో ప్రతిభను కనబరిచి మెడల్స్ సాధించారు. శనివారం పాఠశాల పిఈటి భవాని తెలిపిన వివరాల ప్రకారం ఇటీవల జరిగిన జిల్లాస్థాయి యోగ ఛాంపియన్షిప్ లో 6వ తరగతికి చెందిన టి. చరణ్ గోల్డ్ మెడల్, 7వ, తరగతికి చెందిన కె.రాధిక సిల్వర్ మెడల్ సాధించుకుని విజేతలుగా నిలిచారని తెలిపారు. జిల్లా స్థాయి పోటీలో పాల్గొని తమ ప్రతిభను కనబరిచి మెడల్స్ సాధించుకోవడం హర్షించదగ్గ విషయం అన్నారు. ఈ సందర్భంగా ప్రతిభను కనబరిచి యోగా పోటీలో మెడల్స్ సాధించుకున్న విద్యార్థులు, యోగా పోటీలో పాల్గొని విజేతలుగా జిల్లా స్థాయిలో నిలిచేందుకు కృషి చేసిన పిఈటి భవాని ని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయ అభినందించారు. అభినందించిన వారిలో ఉపాధ్యాయులు కృష్ణ, కిషోర్, కుమార్, సుజాత తదితరులు ఉన్నారు.

## హైదరాబాద్‌లో ఏపీ సీఎం చంద్రబాబును కలిసిన మందకృష్ణ మాదిగ




హైదరాబాద్, ఆగస్టు 24,(జర్నలిస్ట్ వార్త): ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబును ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ కలిశారు. హైదరాబాద్‌లోని ఏపీ సీఎం నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మందకృష్ణకు శాలువా కప్పి చంద్రబాబు సత్కరించారు. ఇటీవల సుప్రీంకోర్టులో ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా తీర్పు వెలువడిన నేపథ్యంలో మందకృష్ణ పలువురు ముఖ్య నేతలను కలుస్తున్నారు.రెండు రోజుల క్రితం తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆయన నివాసంలో కలిశారు. ఈ భేటీలో ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, సీనియర్ నేత మోత్కుపల్లి నర్సింహులు తదితరులు ఉన్నారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును అమలు చేయాలని ఆయన రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు.

## ఆర్టీసీలో త్వరలోనే ఉద్యోగ నియామకాలు

### త్వరలోనే నూతన బస్సులు కొనుగోలు


### ప్రగతిచక్ర అవార్డుల ప్రదానోత్సవంలో మంత్రి పొన్నం




హైదరాబాద్, ఆగస్టు 24,(జర్నలిస్ట్ వార్త): ఆర్టీసీలో ఉద్యోగ నియామకాలు చేపడుతామని, తర్వలోనే 3035 ఉద్యోగాలను కల్పిస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని ఆర్టీసీ కళాభవన్ లో టీజీఆర్టీసీ ఉత్తమ ఉద్యోగులకు ప్రగతిచక్ర అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడారు. ఆర్టీసీ ఉద్యోగి మరణిస్తే రూ. కోటి బీమా ఇచ్చేలా ఎంవోయూ చేసుకుంటుందన్నారు. ప్రజలకు ఇబ్బందులు రానివ్వకుండా, ప్రభుత్వం త్వరలోనే నూతన బస్సులు కొనుగోలు చేస్తామన్నారు. ఉచిత బస్సు ప్రయాణాన్ని ప్రజలకు అందించడంలో ఆర్టీసీ ఉద్యోగులు అంకితభావంతో పనిచేస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలో వచ్చిన తర్వాత ఆర్టీసీకి పూర్వవైభవం వచ్చిందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లు ఆర్టీసీని పట్టించుకోలేదన్నారు. అలాగే ఆర్టీసీ ఉద్యోగుల్లో పోటీతత్వం రావాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఇటీవల ప్రాణాలు కోల్పోయిన ఆర్టీసీ డ్రైవర్ ఎం సంపత్ కుటుంబానికి రూ.కోటి ప్రమాద బీమా చెక్కును అందజేశారు. ఆ తర్వాత ఉద్యోగులకు ప్రగతి చక్రం అవార్డులను ప్రదానం చేశారు. అనంతరం మాట్లాడుతూ మహాలక్ష్మి పథకంతో సంస్థకు అదృష్టలక్ష్మి వచ్చిందన్నారు. కొత్త బస్సులు కొంటున్నామని.. త్వరలోనే నియామకాలు చేపడుతున్నట్లు తెలిపారు. రాబోయే ఐదేళ్లకాలంలో ముందస్తుగా దృష్టిలో పెట్టుకొని బస్సులు, రెండోసారి నియామకాలు చేపడుతున్నామన్నారు. 259వ రోజు 81 కోట్ల మంది మహిళలు ఉచితంగా ప్రయాణం చేశారని, రూ.2750 కోట్ల విలువైన ప్రయాణాన్ని తెలంగాణ అక్కాచె÷-లలెల్లకు అందించామన్నారు. వ్యక్తిగతంగా డ్రైవర్, కండక్టర్, అధికారిగా, మంత్రిగా ఇది సంతృప్తి ఇచ్చే అంశమన్నారు. ఇంటర్నల్ ట్రాన్స్పరెన్సీని మరింత అభివృద్ధి చేసుకోవాలన్నారు. అత్యున్నంగా పని చేసిన వారికి అవార్డులు ఇస్తూ సన్మానం చేసుకుంటున్నామని.. మిగతా వారికి అవార్డులు పొందాలని పోటీతత్వం రావాలన్నారు. పెరుగుతున్న ట్రాఫిక్‌లో ఎలాంటి రిమార్క్ లేని డ్రైవర్లను జోనల్ వారీగా సన్మానం చేసుకోవాలన్నారు. ప్రభుత్వం తరుఫున ఆర్థిక పరమైన అంశాలు ఉన్నపటికీ కార్మికుల సంక్షేమం కోసం క్షేత్రస్థాయి నుంచి ఆలోచిస్తున్నామన్నారు. బాండ్స్ రూ. 80కోట్ల పెమెంట్స్ జరిగాయని.. రూ.200కోట్లు చెల్లించాల్సి ఉందన్నారు. దానికి నిధులు తీసుకొచి.. చెల్లించే బాధ్యత మాదన్నారు. రాఖీ పండగ రోజున 17 కోట్ల ప్రయాణాలు జరిగాయన్నారు. దాంతో రికార్డు స్థాయిలో రూ. 14.90 కోట్ల ఆదాయం వచ్చిందన్నారు. రికార్డు స్థాయిలో 64 లక్షల మంది ప్రయాణం చేశారన్నారు. ఇది సిబ్బంది కృషితోనే జరిగిందన్నారు. ఆర్టీసీలో ఉద్యోగి ఎవరైనా ప్రమాదవశాత్తు చనిపోతే రూ.కోటి బీమా ఇచ్చేలా యూనియన్ బ్యాంక్‌తో ఎంవోయూ చేసుకున్నామన్నారు. ఆర్టీసీ సంస్థ ఎండీ సజ్జనార్ మాట్లాడుతూ. ఉద్యోగులు బాధ్యత పనిచేసి, ఆర్టీసీకి మంచి పేరు తీసుకురావాలన్నారు. అనంత రం ఉత్తమ ఉద్యోగులకు పురస్కారాలను అందజేశారు.

## మెట్రో పెయిడ్ పార్కింగ్‌పై వెనకడుగు

### మహాధర్నా పిలుపుతో దిగివచ్చిన యాజమాన్యం




హైదరాబాద్, ఆగస్టు 24,(జర్నలిస్ట్ వార్త): మెట్రో స్టేషన్ల దగ్గర పెయిడ్ పార్కింగ్ అమలుపై ఇటీవలే మెట్రో కీలక ప్రకటన చేసిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం అమల్లో ఉన్న ఫ్రీ పార్కింగ్ ను ఎత్తేసి సెప్టెంబర్ 1నుండి పెయిడ్ పార్కింగ్ అమలు చేయనున్నట్లు ప్రకటించింది. మెట్రో అధికారుల నిర్ణయంపై సర్వత్రా వ్యతిరేకత వ్యక్తమైంది. మెట్రోస్టేషన్ల వద్ద పెయిడ్ పార్కింగ్ అమలు చేయడంపై మెట్రో అధికారులు మరోసారి వెనక్కి తగ్గారు. పెయిడ్ పార్కింగ్ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఈ నెల 25న మహాధర్నాకు పిలుపునిచ్చారు మెట్రో ప్రయాణికులు. ఈ క్రమంలో పెయిడ్ పార్కింగ్ నిర్ణయంపై మెట్రో అధికారులు వెనక్కి తగ్గారు.ప్రయాణికుల సమస్యలను పరిష్కరించేందుకు పెయిడ్ పార్కింగ్ అమలును వాయిదా వేస్తున్నట్లు, తదుపరి నిర్ణయం త్వరలోనే ప్రకటిస్తామని ఎల్ అండ్ టీ మెట్రో ప్రకటించింది.

# కల్కి-2 లో ప్రభాస్‌ను మరింత బెస్ట్‌గా చూపిస్తాం

## అర్షద్ వార్సీ వ్యాఖ్యలకు స్పందించిన నాగ్ అశ్విన్



బాలీవుడ్ నటుడు అర్షద్ వార్సీ వ్యాఖ్యలపై కల్కి దర్శకుడు నాగ్ అశ్విన్ స్పందించారు. 'కల్కి' సినిమాలో ఓ సన్నివేశాన్ని పోస్ట్ చేసిన నెటిజన్.. ఈ ఒక్క సీన్ బాలీవుడ్ ఇండస్ట్రీ మొత్తంతో సమానం అని క్యాప్షన్ పెట్టారు. ఈ పోస్ట్‌పై నాగ్‌అశ్విన్ స్పందిస్తూ.. టాలీవుడ్, బాలీవుడ్ అని విడదీసి మాట్లాడొద్దన్నారు.'నార్త్-సౌత్, టాలీవుడ్ వెర్సస్ బాలీవుడ్.. ఇలా పోలుస్తూ వెనక్కి వెళ్లొద్దు. మనమందరం ఒక ఇండస్ట్రీకి చెందినవాళ్లమే. అర్షద్ కొంచెం హుందాగా మాట్లాడాల్సింది. అయినా ఫర్వాలేదు. మేము అతడి పిల్లల కోసం 'కల్కి' బుజ్జి బొమ్మలు పంపిస్తాం. కల్కి రెండోభాగం కోసం మరింత కష్టపడి పనిచేస్తాను. అందులో ప్రభాస్‌ను బెస్ట్‌గా చూపిస్తాను అని రాసుకొచ్చారు. ప్రపంచంలో చాలామంది మనల్ని ద్వేషిస్తారు. కానీ, మనం వాటిని పట్టించుకోకుండా ముందుకెళ్లాలి అని నాగ్‌అశ్విన్ చెప్పారు. ప్రభాస్ కూడా ఇదే మాట అంటుంటారని ఆయన తెలిపారు. మరోవైపు ప్రభాస్‌పై అర్షద్ వార్సీ చేసిన కామెంట్స్ తీవ్ర చర్చనీయాంశం గా మారుతున్నాయి. వీటిని ఖండిస్తూ పలువురు సెలబ్రిటీలు సోషల్ మీడియా వేదికగా పోస్టులు పెడుతున్నారు. తాజాగా ఈ అంశంపై 'మా' అధ్యక్షుడు మంచు విష్ణు బాలీవుడ్ మూవీ అండ్ టీవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్‌కు లేఖ రాశారు. అభిప్రాయాల్ని వ్యక్తపరిచే హక్కు అందరికీ ఉన్నప్పటికీ, అర్షద్ చేసిన వ్యాఖ్యలు ప్రభాస్‌ని తక్కువ చేసేలా, వ్యతిరేకతకు కారణమయ్యేలా ఉన్నాయి. భవిష్యత్తులో ఇలాంటి వ్యాఖ్యలు చేయకుండా ఆయనకు సూచనలు చేస్తారని ఆశిస్తున్నాం. ప్రాంతం, భాషతో సంబంధం లేకుండా నటీనటులంతా గౌరవంగా ఉండాలని కోరుతున్నాం. మనమంతా ఒకే కుటుంబంలో భాగమని గుర్తుంచుకోవాలి. ఈ ఐక్యతని కాపాడుకుందాం అంటూ అసోసియేషన్ అధ్యక్షురాలు పూనమ్ థిల్లాన్‌కు రాసిన లేఖలో విష్ణు పేర్కొన్నారు.

# సరిపోదా శనివారం 29న విడుదల

## సెన్సార్ పూర్తి చేసుకున్నట్లు ప్రకటన

నాని కథానాయకుడిగా వస్తున్న తాజా చిత్రం 'సరిపోదా శనివారం' .. నాని 31గా వస్తున్న ఈ సినిమాకు వివేక్ ఆత్రేయ దర్శకత్వం వహిస్తుండగా.. నాని సరసన ప్రియాంక అరుళ్ మోహన్ హీరోయిన్‌గా నటిస్తుంది. తమిళ నటుడు ఎస్‌జే సూర్య కీలక పాత్రలో నటిస్తున్నాడు. డివివి ఎంటర్‌టైన్‌మెంట్స్‌పై డివివి దానయ్య, కళ్యాణ్ దాసరి హై బడ్జెట్, భారీ కాన్వాస్‌తో ఈ సినిమా తెరకెక్కుతుంది. ఈ చిత్రం ఆగష్టు 29న ప్రేక్షకుల ముందుకు రానున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే వరుసగా మూవీ ప్రమోషన్స్ చేస్తుంది. అయితే తాజాగా ఈ చిత్రం సెన్సార్ పనులు పూర్తి చేసుకున్నట్లు నాని సోషల్ మీడియా వేదికగా ప్రకటించాడు. ఈ సందర్భంగా ఒక వీడియోను కూడా వదిలాడు. 'సరిపోదా శనివారం' సెన్సార్ కంప్లీట్ అయ్యింది. సెన్సార్ బోర్డ్ ఇ/ం సర్టిఫికెట్ ఇచ్చింది. అలాగే 2 గంటల 35 నిమిషాలు రన్ టైం అని నాని చెప్పగా.. వెనక నుంచి ఎస్‌జే సూర్య వచ్చి ప్లస్ 15 మినిట్స్ అంటాడు. మొత్తం 2 గంటల 50 నిమిషాలు అంటే సుందరానికి కూడా ఇదే రన్ టైం కదా అంటూ ఎస్‌జే సూర్య అనగా.. అంటే కాదు.. 'సరిపోదా శనివారం' అంటూ నాని అనడం ఇది ఒక యాక్షన్ మూవీ అండ్ లవ్ స్టోరీ అంటూ వీడియోను వదిలారు.






# ఆ విషయంలో చాలా క్లారిటీగా ఉన్న కృతి సనన్

మహేష్ బాబు హీరోగా సుకుమార్ దర్శకత్వంలో రూపొంది 2014 లో ప్రేక్షకుల ముందుకు వచ్చిన '1 నేనొక్కడినే' సినిమా తో సినీ రంగంలో అడుగు పెట్టిన ముద్దుగుమ్మ కృతిసనన్. తెలుగు లో ఈమెకి మొదటి సినిమాతోనే నిరాశ ఎదురైంది. ఆ తర్వాత చేసిన తెలుగు సినిమాలు కూడా ఆశించిన స్థాయిలో విజయాలను సొంతం చేసుకోలేక పోయాయి. దాంతో ఈమె కెరీర్ లో ఎదగడం కష్టమే అనే అభిప్రాయంను చాలా మంది వ్యక్తం చేశారు. కానీ అనూహ్యంగా బాలీవుడ్ నుంచి ఈ అమ్మడికి మంచి ఆఫర్లు లభించాయి. కెరీర్ ఆరంభంలో చిన్న చిన్న హిందీ సినిమాల్లో నటించిన ఈమె ప్రస్తుతం బాలీవుడ్ స్టార్స్ కి మోస్ట్ వాంటెడ్ హీరోయిన్ గా వరుసగా సినిమాల్లో నటిస్తోంది. కృతి సనన్ సినీ రంగ ప్రవేశం చేసి పదేళ్లు పూర్తి చేసుకుంది. ఆ సందర్భంగా ఒక మీడియా చిట్ చాట్ లో ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. ముఖ్యంగా రిలేషన్ షిప్ గురించి కృతి సనన్ మాట్లాడుతూ... ఏ రిలేషన్ లో అయినా చిన్న చిన్న గొడవలు అనేవి చాలా సహజం. అయితే గొడవ జరిగినప్పుడు నా తప్పు ఉంటే నేనే ముందు క్షమాపణలు చెబుతాను. నా తప్పు లేనప్పుడు క్షమాపణలు చెప్పను. అయితే ఏదో విధంగా గొడవను పరిష్కరించుకుంటాను. అంతే తప్ప ఆ గొడవను మళ్లీ మళ్లీ పెద్దగా అయ్యే విధంగా పెంచుకోను. ఏ సమస్య అయినా అలాగే వదిలేస్తే పెద్దది అవుతుంది. అందుకే ఏదో విధంగా సమస్యను పరిస్కరించుకుని, రిలేషన్ ను కొనసాగించాలని భావిస్తాను. ప్రతి చిన్న విషయానికి కన్నీళ్లు పెట్టుకోను. అయితే ఎవరితో అయినా గొడవ పడితే కోపంతో నాకు కన్నీళ్లు వస్తాయి. నా బాధ కన్నీళ్ల రూపంలో బయటకు వచ్చేస్తుంది. సినిమా అంటే నాకు చాలా ఇష్టం, సాధ్యం అయినంత ఎక్కువ కాలం ఇండస్ట్రీలోనే కొనసాగుతాను, అవకాశాలు వచ్చేంత వరకు నటిస్తూనే ఉంటాను అంటూ చెప్పుకొచ్చింది. రిలేషన్ షిప్ విషయంలో కొందరు క్లారిటీ లేక పోవడంతో విడిపోవడం, బ్రేకప్ అవ్వడం చూస్తూ ఉంటాం. ముఖ్యంగా చాలా మంది భార్య భర్తలు చిన్న చిన్న గొడవలకు విడాకులు తీసుకోవడం మనం చూస్తూ ఉంటాం. అలాంటి వారికి కృతి సనన్ చెప్పిన సారి సలహా సరిగ్గా పని చేస్తుంది. ఆమె తన రిలేషన్ షిప్ ను చక్కగా కొనసాగించడం కోసం చాలా క్లారిటీ గా ఉందని అర్థం అవుతుంది. సోషల్ మీడియాలో కృతి సనన్ రిలేషన్‌షిప్ గురించి చేసిన వ్యాఖ్యలు, ఆమె తన తప్పు ఉంటే క్షమాపణ చెప్పేందుకు సిద్ధం అంటూ చెప్పిన తీరుకు అంతా ఫిదా అవుతున్నారు.

# నిర్మాత అశ్వినీదత్‌కు చిరు కానుక



ప్రముఖ నిర్మాత అశ్వనీదత్‌కు అగ్ర కథానాయకుడు చిరంజీవి విలువైన కానుక అందజేశారు. 'ఇంద్ర' రీ రిలీజ్ ను పురస్కరించుకుని ఆ చిత్రబృందాన్ని శుక్రవారం చిరు కలిశారు. నిర్మాత అశ్వనీదత్, దర్శకుడు బి.గోపాల్, సంగీత దర్శకుడు మణిశర్మ, సినీ రచయితలు పరుచూరి గోపాలకృష్ణ, వెంకటేశ్వరరావు, చిన్నికృష్ణలను ప్రత్యేకంగా ఆహ్వానించి సత్కరించారు. ఆ సినిమా విశేషాలను నెమరువేసుకున్నారు.ఇందులో భాగంగా అశ్వనీదత్‌కు ఒక అందమైన శంఖాన్ని బహుమతిగా అందజేశారు. ఈ విషయాన్ని తెలియజేస్తూ అశ్వనీదత్ తాజాగా ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు. ఈ విజయశంఖాన్ని కానుకగా మీరు ఇచ్చారు. కానీ, ఇంద్రుడై, దేవేంద్రుడై దానిని పూరించింది మాత్రం ముమ్మాటికీ మీరే. ఈ కానుక అమూల్యం. ఈ జ్ఞాపకం అపురూపం. అదెప్పటికీ నా గుండెల్లో పదిలం అని పేర్కొన్నారు. 'ఇంద్ర' టీమ్‌ను కలవడంపై చిరు ఆసక్తికర ట్వీట్ చేశారు. 'ఇంద్ర' క్రియేట్ చేసిన సునామీ గుర్తుచేస్తూ 22 సంవత్సరాల తర్వాత మరోసారి థియేటర్లలో రిలీజైన సందర్భంగా చిరు సత్కారం. సినిమా మేకింగ్ విశేషాలను నెమరు వేసుకోవడం జరిగిందని తెలిపారు. ఇంద్ర' సినిమా నా జీవితంలో ఎంతో ముఖ్యమైనది. కాలం మారిపోతుంది. తరాలు మారిపోతాయి. ఒక్కరు మాత్రమే కాలానికి ఎదురీది.. తరాలను దాటి.. శాశ్వతంగా నిలిచి పోరాటం చేస్తారు. అలాంటి వ్యక్తే మెగాస్టార్ చిరంజీవి. ఆయన హీరోగా నటించిన ఈ చిత్రాన్ని నిర్మించడం నా అదృష్టం. థాంక్యూ చిరు. త్వరలో మీతో ఐదో చిత్రం కూడా నిర్మిస్తా అని మాటిస్తున్నా అని ఇటీవల 'ఇంద్ర' రీ రిలీజ్‌ను ఉద్దేశించి అశ్వనీదత్ పేర్కొన్నారు. చిరంజీవి - అశ్వనీదత్ కాంబినేషన్‌లో ఇప్పటివరకూ నాలుగు చిత్రాలు తెరకెక్కాయి. ఈ కాంబోలో తెరకెక్కిన తొలి చిత్రం 'జగదేక వీరుడు అతిలోక సుందరి' ఎన్నో రికార్డులను బ్రేక్ చేసింది. ఎవర్‌గ్రీన్ క్లాసిక్ మూవీగా గుర్తింపు సొంతం చేసుకుంది. చిరు హీరోగా నటించిన 'చూడాలని వుంది', 'ఇంద్ర', 'జై చిరంజీవ'లను అశ్వనీదత్ నిర్మించారు.




# నితిన్ హోమ్ బ్యానర్ లో మరో క్రేజ్ ప్రాజెక్ట్

హీరో నితిన్ హోమ్ బ్యానర్ శ్రేష్ట్ మూవీస్ అప్పుడప్పుడు కొన్ని నిర్ణయాలతో హాట్ టాపిక్ గా మారుతూ ఉంటుంది. నితిన్ తండ్రి సుధాకర్ రెడ్డి, అక్క నిఖిత రెడ్డి సినిమాలని నిర్మించడంతో పాటు ఇతర మూవీస్ ని డిస్టిబ్యూట్ చేస్తూ ఉంటారు. శ్రేష్ట్ మూవీస్ కి తెలుగు రాష్ట్రాలలో డిస్టిబ్యూషన్ కంపెనీగా మంచి పేరుంది. గతంలో యూనివర్సల్ యాక్టర్ కమల్ హాసన్ విక్రమ్ సినిమా తెలుగు రాష్ట్రాల థియాట్రికల్ రైట్స్ ని శ్రేష్ట్ మూవీస్ సొంతం చేసుకుంది. ఈ సినిమా వారికి మంచి లాభాలు తెచ్చిపెట్టింది. ఇప్పుడు మరో తమిళ్ మూవీ తెలుగు రాష్ట్రాల థియాట్రికల్ రైట్స్ ని శ్రేష్ట్ మూవీస్ సొంతం చేసుకుంది. శివ కార్తికేయన్ హీరోగా రాజ్ కుమార్ పెరిస్వామి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న పాన్ ఇండియా మూవీ అమరన్. ఈ మూవీలో సాయి పల్లవి హీరోయిన్ గా నటిస్తోంది. ఈ సినిమా అక్టోబర్ 31న దీపావళి సందర్భంగా రిలీజ్ కాబోతోంది. ఈ మూవీని రాజ్ కమల్ ఫిల్మ్ ఇంటెర్నేషనల్, సోనీ పిక్చర్స్ సంయుక్తంగా భారీ బడ్జెట్ తో నిర్మిస్తున్నాయి. రాజ్ కమల్ బ్యానర్ కమల్ హాసన్ దనే సంగతి అందరికి తెలిసిందే. విక్రమ్ సినిమాతో శ్రేష్ట్ మూవీస్ అధినేత సుధాకర్ రెడ్డికి మంచి అనుబంధం ఏర్పడింది. ఈ నేపథ్యంలో అమరన్ సినిమా తెలుగు స్టేట్స్ థియాట్రికల్ రైట్స్ ని ఫ్యాన్సీ ధరకి సొంతం చేసుకున్నట్లు తెలుస్తోంది. ఈ మూవీ రైట్స్ ని శ్రేష్ట్ మూవీస్ దక్కించుకుందని తాజాగా వీడియో రిలీజ్ చేసి కన్ఫర్మ్ చేశారు. ఇప్పటికే ప్రేక్షకుల ముందుకొచ్చిన అమరన్ టీజర్ కి పాజిటివ్ రెస్పాన్స్ వచ్చింది. శివ కార్తికేయన్ కెరియర్ లోనే హైయెస్ట్ బడ్జెట్ తో ఈ మూవీ తెరకెక్కుతోంది. ఈ చిత్రంలో ఇండియన్ ఆర్మీ ఆఫీసర్ గా శివ కార్తికేయన్ కనిపించబోతున్నాడు. తెలుగు రాష్ట్రాలలో కూడా శివ కార్తికేయన్ కి మంచి మార్కెట్ ఉంది. అలాగే సాయి పల్లవి ఇమేజ్ కూడా అమరన్ సినిమాకి ప్లస్ అవుతుందని అంచనా వేస్తున్నారు. శివ్ అరోరా, రాహుల్ సింగ్ రాసిన ఇండియన్ మోస్ట్ ఫియర్ లెస్ బుక్ లో మేజర్ వరదరాజన్ చాప్టర్ ఆధారంగా అమరన్ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారని తెలుస్తోంది. ప్రస్తుతం ఈ మూవీ పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ జరుగుతోంది. జీవీ ప్రకాష్ కుమార్ మ్యూజిక్ కూడా ఈ చిత్రానికి అదనపు ఆకర్షణ అవుతుందని భావిస్తున్నారు. శివ కార్తికేయన్ కెరియర్ లో పవర్ ఫుల్ యాక్షన్ ప్యాక్డ్ కథాంశంతో చేస్తోన్న సినిమా ఇదే కావడంతో భారీ అంచనాలు క్రియేట్ అయ్యి ఉన్నాయి.